మెజిస్ట్రేట్ నావంక కాసేపు నిశితంగా చూశాడు. మిగతా ఆరుగురి కన్నా నేను ఎక్కువసేపు నిలబడ్డాను బోనులో. ఆయన నన్ను నిశ్శబ్దంగా కనిపించీ కనిపించని చిరునవ్వుతో గమనించటం చూసి ఫైన్ ఎక్కువ వేస్తాడనుకున్నాను।

ఆశ్చర్యం!

ఒక్క పైసా ఫైన్ వేయకుండా వదిలేశాడు నన్ను! ఆ తర్వాత దోషికి ఎనిమిదిరూపాయల ఫైన్ విధించాడు।

ఫైన్ కట్టకుండానే దిగిపోయి పేరడైజ్ స్టాప్‌దాకా నడిచే వెళ్ళాను ఎందుకు మెజిస్ట్రేట్ నాకు ఫైన్ వేయలేదని ఆలోచిస్తూ.

నిన్ననే సమాధానం దొరికింది ఆ ప్రశ్నకి. గాంధీభవన్‌లో డ్రామా చూడటానికి వెళ్ళినప్పుడు ఆ మెజిస్ట్రేట్ ఆ డ్రామా రచయిత, ఆ రోజు మొబైల్ కోర్టు బోనులో నిలబడ్డప్పుడు నా చేతిలో వున్న నవల కూడా ఆయన రాసిందే.

(1978—వీచిక)

# పోస్టుచేయని కథ

"సారీ సార్. మిమ్మల్ని పొద్దున్నే డిస్టర్బ్ చేసినట్లున్నాను" అన్నాడు సిద్ధార్థ పొద్దునే వచ్చి.

"పర్వాలేదు. రండి" అన్నాను.

ఆ రోజు ఆదివారం. అంతకు నాలుగు రోజులు ముందు పరిచయం అయ్యాడు సిద్ధార్థ నాకు, మా స్నేహితుడింట్లో. మా స్నేహితుడి ప్రక్క ఇల్లే అతనిది. నేను కథలు వ్రాస్తూంటానని సిద్ధార్థకి మాటల్లో ఒకసారి ఎప్పుడో మా స్నేహితుడి భార్య చెప్పిందట. ఈసారెప్పుడయినా వస్తే

పరిచయం చేయండి అని అడిగాడట. ఫలితంగా నేను వాళ్ళింటికి వెళ్ళి నప్పుడు పిలిపించి పరిచయం చేశారు.

సాహిత్యం మీద కాసేపు సంభాషణ సాగాక సిద్ధార్థలో రచయిత అయేందుకు కావలసిన బీజం, నైజం వున్నాయనిపించింది నాకు. ఆసంగతే అన్నాను అతనితో.

"నాకు వ్రాయాలని ఉత్సాహం వుందండీ. నాలుగయిదు ప్రచురింపబడ్డాయికూడా. వ్రాసి పోస్టు చేయకుండావున్న కథలు రెండు, మూడు వున్నాయి మీరేమనుకోకపోతే, వాటి నొక సారి చదివి, మీ అభిప్రాయం తెలియ చేయాలి" అన్నాడు సిద్ధార్థ కొద్దిగా అర్థింపుగా.

"దాందేముంది. ఓసారి ఇవ్వండి చదివి చెప్తాను" అన్నాను మొహమాటానికి. నిజానికి నాకు ఇతర రచయితల వ్రాతప్రతులు చదవటం కానీ, నా వ్రాతప్రతులు ప్రచురణకి ముందు ఇతరులు చదవటం అంటే కానీ అయిష్టం, నా కథని మొదటిసారి సంపాదకుడే చదవాలి అనే దృక్పథం నాది

నా గది చిరునామా, చేరుకోడానికి గుర్తులు అడిగి తెలుసుకున్నాడు సిద్ధార్థ. ఆదివారం వుదయం వస్తానని కూడాచెప్పాడు.

బాటిల్‌లో పాలు గిన్నెలో పోసి, స్టవ్ వెలిగించి, గిన్నెని స్టవ్‌మీద పడేసి, అతనికో పుస్తకం కాలక్షేపానికి ఇచ్చి బాత్‌రూంలోకి వెళ్ళాను.

అరగంట తర్వాత కాఫీ త్రాగాక, సిద్ధార్థ తనతో తెచ్చిన కవరు లోంచి ఒక వ్రాతప్రతిని బయటకి తీసాడు.

సిద్ధార్థ ఆ కథని చదవటం మొదలెట్టాడు. ఆ కథ మనుషులకి అతీతమయిన "సిక్స్‌త్ సెన్స్, ప్రీమోనిషన్" మీద అల్లబడింది. పది నిమిషాలలో ఆ కథని పూర్తిగా చదివేసాడు. వ్రాసే కొత్తల్లో వచ్చే పొరపాట్లు తప్ప ఆ కథ బాగానే వచ్చింది అన్ని విధాలా.

"చాలా బావుంది" అన్నాను నవ్వి, సిద్ధార్థ మొహం తృప్తితో వెలిగిపోయింది. కొన్ని క్షణాలు.

"దేనికి పంపమంటారు!" అడిగాడు చెప్పాను.

"దానికే పంపుదా మనుకుంటున్నాను, పోటీకి" అన్నాడు.

మరో అరగంట తర్వాత నా సూచనల మేరకు మార్పులు చేసి, "థాంక్స్" చెప్పి వెళ్ళి పోయాడు.

సిద్ధార్థ వెళ్ళిపోయిన అరగంటదాకా అలాగే ఆలోచిస్తూ కూర్చుండి పోయాను. డ్రాయరు తెరచి, నేను అంత క్రితం రాత్రి వ్రాసిన కధని తీసి సాంతం చదివాను చిన్నగా నిట్టూర్చాను.

యాదృచ్ఛికం! కాకతాళీయం!!

సరిగా సిద్ధార్థ నాకు వినిపించినలాంటి కథే నేను వ్రాశాను. అదే కథ సిద్ధార్థ నా కన్న ముందే వ్రాశాడు. అదే ఇతివృత్తం మీద ఇద్దరం దాదాపు ఒకే మూసలో ఉన్న కధని ఎల్లా ఒకరికి తెలియకుండా ఒకరం

ఆ కథ వ్రాత ప్రతిని, దాని కార్బన్ కాపీని చింపేస్తుంటే, నాకు ఎందుకో గుండెలో దేవినట్లయింది ఇలా జరగడం మొదటిసారేనేమో. ఆ కధని నాకు ఆ ప్లాట్ తట్టినప్పుడే వ్రాసివుండాల్సింది నేను ఆలస్యం చేయకుండా.

సిద్ధార్థ కొత్తగా వృద్ధిలోకి వస్తున్న రచయిత క్రొత్తలో ఎన్ని కథలు వ్రాస్తే అంత మంచిది, అతనికి నా కథ చదివి వినిపించి, "మరి దీన్ని పంపొద్దు" అనటం భావ్యం కాదు, నిరాశగా వెళ్ళిపోయేవాడు, నా ముందే ఆ కధని చింపేసి.

సిద్ధార్థకి, ఆ కధకి సెకండ్ ప్రయిజ్ వచ్చిందని తెలిసిన రోజు నేను సమానంగా ఆనందించాను, బాధపడ్డాను.